క్లుప్తంగా

చురుగ్గా ఉపాధి పనులు

తుగ్గలి: మండలంలో ఉపాధి పనులు జోరందుకుంటున్నాయి. మండలవ్యాప్తంగా మంగళవారం 3,600 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యారు. వ్యవసాయ పనులు పూర్తికావడంతో ఫీల్డ్‌అసిస్టెంట్లు గ్రామాల్లో కూలీలకు పనులు కల్పిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ పనులు కల్పించేలా ఉపాధి అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఆయా గ్రామాల్లో ఇంకుడు గుంతల తవ్వకం, కాలువల్లో పూడిక తొలగింపు వంటి పనులు కూలీలు చేస్తున్నారు. కూలీల సంఖ్య పెంచాలని ఏపీఓ రామకృష్ణ ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లను ఆదేశించారు.

కడమకుంట్ల వాసికి డాక్టరేట్


జయరాముడు

తుగ్గలి: మండల పరిధిలోని కడమకుంట్ల గ్రామానికి చెందిన సి.జయరాముడు శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. పీజీ. ఎంఫిల్, పీహెచ్‌డీ చేసిన జయరాం అనంతపురం ఎస్‌ఎస్‌బీఎన్ డిగ్రీ కాలేజీలో లైబ్రేరియన్ సైన్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. యూనివర్సిటీ అసిస్టెంట్ లైబ్రేరియన్ డాక్టర్ కె.రామసుబ్బయ్య ఆధ్వర్యంలో లైబ్రేరియన్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం నందు 'పెర్ఫార్మెన్స్ అండ్ ఫైనాన్స్ ఆఫ్ పబ్లిక్ లైబ్రరీస్ ఇన్ రాయలసీమ రీజియన్' అంశంపై పరిశోధన చేసినందుకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు మంగళవారం జయరాం తెలిపారు.

ఘనంగా భీష్మ ఏకాదశి


భీష్మ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

వెల్దుర్తి(కృష్ణగిరి): మండల కేంద్రంలో బెస్త సంఘం ఆధ్వర్యంలో మంగళవారం భీష్మ ఏకాదశి ఘనంగా నిర్వహించారు. ముందుగా పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. భీష్మ చిత్రపటానికి పూజలు చేసి ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి, చెక్క భజనలతో పురవీధుల గుండా ఊరేగించారు. బెస్త, తెలుగు కులస్తులందరు కలిసి ఎల్లమ్మ గుడి రస్తాలోని గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేపట్టారు. బెస్త సంఘం నాయకులు కోదండ, రమేష్, బాలాజీ, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

పత్తికొండ రూరల్: మద్యం అక్రమ రవాణా చేస్తూ వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను మంగళవారం పత్తికొండ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కార్యాలయం ఆవరణలో సీఐ సువర్ణలత ఆధ్వర్యంలో వేలం వేశారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ పర్యవేక్షణలో 12 వాహనాలను వేలం వేయగా రూ.99 వేలకు పాటదారులు దక్కించుకున్నట్లు సీఐ తెలిపారు.

విజిలెన్స్ తనిఖీలు


కారం మిల్లులో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సీఐ సునీల్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని కారం మిల్లుల్లో విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం రాత్రి విజిలెన్స్ సీఐ సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఎండుమిర్చిని మిల్లులో వేసి కారం పట్టడంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా, లేదా అని పరిశీలించినట్లు తెలిపారు. కారం పట్టే సమయంలో ఉప్పు, కలర్ వాడుతున్నట్లు అనుమానాలు రావడంతో శాంపిల్స్ తీసుకొని హైదరాబాద్ ల్యాబ్‌కు పంపుతున్నట్లు చెప్పారు. రిపోర్టులు వచ్చిన తరువాత ఆ ప్రకారం చర్యలు చేపడతామన్నారు. ఫుడ్ సెఫ్టీ అధికారి రాజగోపాల్, సిబ్బంది ఉన్నారు.

27 నుంచి గాయత్రీ ఉత్సవాలు

ఆస్పరి: ఆస్పరి సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీమాత ఉత్సవాలు ఈనెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు రూపామోహన్‌శర్మ మంగళవారం తెలిపారు. ఆలయంలో 27వ తేదీన అమ్మవారికి ప్రత్యేక పూజలు, 28న గంగ, ఆకుపూజ, కుంకుమార్చన హోమం, శంకరబండ గ్రామంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు, 29న పంచామృతాభిషేకం, కుంకుమార్చన, కలశ పూజ, పంచకుండి గాయత్రీ యజ్ఞం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

నేడు ఆసరా సంబరాలు

తుగ్గలి: వైఎస్సార్ ఆసరా కార్యక్రమం బుధవారం జొన్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల, సచివాలయ అధ్యక్షులు జిట్టా నాగేష్‌యాదవ్, హనుమంతు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరై మహిళా సంఘాలకు ఆసరా మెగా చెక్కు పంపిణీ చేస్తారన్నారు. పొదుపు మహిళలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

మారెమ్మ గ్రామోత్సవం

కృష్ణగిరి: తొగర్చేడులో మారెమ్మకు నూతనంగా నిర్మించిన గుడిని గ్రామస్తులు మంగళవారం ప్రారంభించి పూజలు నిర్వహించారు. అమ్మవారి ప్రతిమను ఎద్దుల బండిపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు.

సేవకులకు సత్కారం



అవార్డులు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, సమన్వయకర్త బుట్టారేణుక,   పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

గోనెగండ్ల: ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిస్వార్థంగా లబ్ధిదారుల చెంతకు చేర్చుతున్న వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, మాజీ ఎంపీ, నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక అన్నారు. మంగళవారం గోనెగండ్లలోని బాషా ఫంక్షన్ హాలులో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి గ్రామాల్లోని ప్రజలకు అండగా నిలిచారని కొనియాడారు. ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన లబ్ధిదారులకు నేరుగా వారి ఇంటి వద్దకే చేరవేయడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. అనంతరం సేవా వజ్ర అవార్డుకు ఎంపికైన వి.శృతికి రూ.45 వేలు, సేవా రత్న అవార్డుకు ఎంపికైన ఐదుగురు వలంటీర్లు మంచల మహబూబ్ బాషా, కందోలి సతీష్, గొల్ల శిరీష, బోయ రాముడు, ప్రేమర లక్ష్మన్నకు రూ.30 వేలు చొప్పున, సేవామిత్రలు 347 మందికి రూ.15 వేలు చొప్పున ప్రోత్సాహక నగదు వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. అవార్డులకు ఎంపికైన వలంటీర్లకు ప్రశంస పత్రంతో పాటు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఎంపీపీ టీ.నసురుద్దీన్, ఎంపీడీఓ సోనిబాయి, ఈఓఆర్డీ నాగేష్, ఏఓ బాబుభాస్కర్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, సతీష్, సింగిల్‌విండో ప్రెసిడెంట్ తిరుమల రెడ్డి, యూత్ అధ్యక్షుడు బందెనవాజ్, కన్వీనర్ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవకులు వలంటీర్లు

పత్తికొండటౌన్: పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారి గడప వద్దకే అందిస్తున్న ప్రజా సేవకులు వలంటీర్లు అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కొనియాడారు. మంగళవారం పత్తికొండ పట్టణంలోని టీటీడీ కల్యాణమండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. పత్తికొండ మండలంలోని గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది హాజరయ్యారు. సేవా పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మానస పుత్రికలు గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలు అన్నారు. దేశంలోని మిగతా రాష్ట్రాల వారికి వలంటీర్ల సేవలు ఆదర్శంగా నిలిచాయన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలకు నిస్వార్థంగా సేవలందించిన ఘనత వలంటీర్లకే దక్కిందని వివరించారు. వలంటీర్ల సేవల వల్ల ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్ష పార్టీలు బెంబేలెత్తుతున్నాయని ఎద్దేవా చేశారు. అంతకుముందు పలువురు వలంటీర్లు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి, పత్తికొండ మండలంలో జరిగిన అభివృద్ధిపై మాట్లాడారు. ఎంపీడీఓ రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ నారాయణదాసు, జెడ్పీటీసీ సభ్యురాలు ఉరుకుందమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగడు, మండల కన్వీనర్ కారం నాగరాజు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్ నాయక్, సర్పంచులు అంజినయ్య, శ్రీరాములు, ప్రవీణ, కేశవరెడ్డి, వైస్ ఎంపీపీ బలరాముడు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ఘనసన్మానం


దేవనకొండ: వలంటీర్లను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంక్షేమ వారధులు వలంటీర్లు

చిప్పగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ వలంటీర్ వ్యవస్థతో ప్రజల ఇళ్ల వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బుసినె విరూపాక్షి అన్నారు. మంగళవారం స్థానిక శ్రీ శక్తి భవనంలో అవార్డులకు ఎంపికైన గ్రామ వలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందించి ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థతో సాకారమైందన్నారు. వలంటీర్లపై టీడీపీ, జనసేన చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఎంపీడీఓ బరెన్‌సాహెబ్, ఈఓపీఆర్డీ బాలన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు మారయ్య, సుంకన్న లింగన్న, వెంకటేష్ పాల్గొన్నారు.


చిప్పగిరి: పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో సమన్వయకర్త బుసినె విరూపాక్షి

అదృష్టంగా భావిస్తున్నా



ప్రభుత్వ ఆశయాలను నెరవేరుస్తూ గ్రామంలోని పేదలకు సేవలందించడం సంతృప్తిగా ఉంది. వలంటీర్‌గా అవకాశం కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటాను. సేవలను గుర్తించి ప్రభుత్వం నన్ను ఎమ్మెల్యే చేతుల మీదుగా సత్కరించడం నా అదృష్టంగా భావిస్తున్నా.
– వి. శృతి, వలంటీర్, గంజిహళ్లి గ్రామం

జగనన్నకు రుణపడి ఉంటాం



ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేకుండా స్వేచ్ఛగా పని చేస్తూ లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. నిరుద్యోగిగా ఉన్న నాకు వలంటీర్‌గా ఉపాధి కల్పించి ఆర్థికంగా ఆదుకుంటున్న జగనన్న ప్రభుత్వానికి మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది. గ్రామంలోనే ప్రజలకు సేవల చేసే అవకాశం లభించడం ఎంతో ఆనందంగా ఉంది.
– మంచల మహబూబ్ బాషా, వలంటీర్, గోనెగండ్ల

దేవనకొండ: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్ల పాత్ర ఎనలేనిదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మల్లికార్జున, మండల జేసీఎస్ కన్వీనర్ రాజారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఎంపీడీఓ ఇద్రూష్‌బాషా ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వలంటీర్లను శాలువా, పూలమాలలతో సత్కరించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అలారుదిన్నెకు చెందిన ఇస్పింటి లక్ష్మన్న, కరివేముల – తెలుగు గంగరాజు, కుంకనూరు – మంగలి రవికుమార్, పి.కోటకొండ – కొవ్వు పెద్దయ్య, తెర్నెకల్ – బోయ నాగరాజుకు సేవారత్న పురస్కారాలు అందుకున్నారు. అలాగే 294 మంది సేవామిత్ర అవార్డులు పొందారు. నాయకులు తపాల శ్రీనివాసులు, లుముంబా, ఉరుకుందు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎస్ ట్యాంకుల పరిశీలన


గోనెగండ్లలో ఫిల్టర్ బెడ్లను పరిశీలిస్తున్న అధికారులు

గోనెగండ్ల: మండల కేంద్రంలోని ఎస్‌ఎస్ ట్యాంక్, అలువాల ఎస్‌ఎస్ ట్యాంకులను మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ అధికారులు సాంబయ్య, శివకుమార్‌లు పరిశీలించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు ఎన్ని మోటర్లు ఉన్నాయి. విద్యుత్ కనెక్షన్, సరఫరా ఎలా ఉంది. నీటి పథకాలకు విద్యుత్ సరఫరా అవుతుందా లేదా అని పరిశీలించారు. అలాగే ట్యాంకుల్లో నీటి స్టోరేజ్ ఎంత ఉంది. వచ్చే వేసవికి నీరు సరిపోతాయా లేదా, ఫిల్టర్‌బెడ్లు, మోటార్లు పనిచేస్తున్నాయా లేదా అని ఏఈ శ్రీనివాస రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని ట్యాంకులను పరిశీలించి అక్కడి సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు వారు తెలిపారు. వేసవిలో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఏఈ శ్రీనివాస రెడ్డి సూచించారు.

బైక్ అదుపుతప్పి అక్కాతమ్ముడికి గాయాలు


గాయపడిన రఘును అంబులెన్స్‌లో ఎక్కించే ప్రయత్నంలో సిబ్బంది

వెల్దుర్తి(కృష్ణగిరి): కల్లూరు మండల పరిధిలోని ఉలిందకొండ హైవేపై మంగళవారం బైక్ అదుపుతప్పి కిందపడడంతో వెల్దుర్తికి చెందిన అక్కాతమ్ముడు వీణ, రఘు గాయపడ్డారు. వీణ వెల్దుర్తి మండల పరిధిలోని సూదేపల్లె (మదార్‌పురం) సచివాలయంలో ఏఎన్‌ఎంగా పనిచేస్తోంది. ఆమె పరిధిలో ఓ గర్భిణికి హైరిస్క్‌తో ఉండడంతో కర్నూలు సమీపంలోని కోడుమూరు రోడ్డు పెంచికలపాడు ఆసుపత్రిలో చికిత్సకు పంపారు. గర్భిణి పరిస్థితి తెలుసుకునేందుకు ఏఎన్‌ఎం వీణ కర్నూలుకు తన తమ్ముడు రఘుతో కలిసి బైక్‌పై బయలుదేరింది. మార్గం మధ్యలో బైక్ అదుపుతప్పి కిందపడడంతో రఘుకు తీవ్ర గాయాలు కాగా వీణకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పేదల ఆరోగ్యానికి 'సురక్ష'


పెద్దకొత్తిలిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

నందవరం: సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం పల్లెల్లోని పేదలకు మెరుగైన వైద్యసేవలందిస్తూ వారి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, డాక్టర్ విజయభారతి పేర్కొన్నారు. మంగళవారం పెద్దకొత్తిలి గ్రామంలో రెండవ విడత సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ బైటిగేరి శివన్న, ఎంపీటీసీ విజయమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్లు ప్రారంభించారు. స్థానిక గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన శిబిరంలో 480 మందికిపైగా చికిత్సలు పొందారు.

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు గ్రామంలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరంలో 404 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ బరెన్‌సాహెబ్, మెడికల్ ఆఫీసర్ పార్వతమ్మ పాల్గొన్నారు.

హాలహర్వి: మండలంలోని విరుపాపురం గ్రామంలో సురక్ష వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ ఆంతోనీ పర్యవేక్షించారు. వైద్యులు తిమ్మన్న, మన్సూర్‌వలీ రోగులకు ఉచితంగా వైద్యం అందించి మందులను పంపిణీ చేశారు.

దేవనకొండ: మండలంలోని పి.కోటకొండ గ్రామంలో వైద్యాధికారి అతావుల్లా ఆధ్వర్యంలో సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. సాయంత్రం 5 గంటల వరకు దాదాపు 200కు పైగా ప్రజలు వైద్యసేవలు పొందారు.

కృష్ణగిరి: కోయిలకొండ గ్రామంలో నిర్వహించిన సురక్ష శిబిరంలో 402 మందికి వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు అందినట్లు వైద్యాధికారి ప్రదీప్ తెలిపారు. ఎంపీహెచ్‌ఈఓ గజేంద్రారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రంగస్వామి రథోత్సవం


దేవబెట్టలో రంగస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని దేవబెట్ట గ్రామంలో రంగస్వామి మహారథోత్సవం మంగళవారం సాయంత్రం కనులపండుగుగా జరిగింది. ఉదయం నుంచి దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవమూర్తిని రథంపై ఉంచి రెడ్డిమాన్ ఇంటి నుంచి పూర్ణకుంభం తీసుకువచ్చి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అశేష భక్తుల మధ్య స్వామి వారి రథం ముందుకు కదలి గ్రామ వీధుల్లోకి వెళ్లింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, ఎస్‌ఐ శరత్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్త్ నిర్వహించారు.

ముగిసిన సిద్ధేశ్వరస్వామి జాతర


ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

హొళగుంద: ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు గ్రామాలతో పాటు మండల ప్రజల ఆరాధ్య దేవుడు సిద్ధేశ్వర స్వామి జాతర ఉత్సవాలు మంగళవారం వసంతోత్సవ కార్యక్రమాలనంతరం వైభవంగా ముగిశాయి. 14న కంకణ ధారణతో ఉత్సవాలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. 18న రథోత్సవం వైభవంగా జరగ్గా, 19న లంకాదహనం కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం వసంతోత్సవంలో భాగంగా ఆలయంలో సిద్ధేశ్వరునికి ఆకుపూజ, మహామంగళారతి, అభిషేకాలు, తదితర పూజలు చేపట్టారు. రాత్రి ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి ఊరేగింపుగా ఆలయ పూజారుల ఇంటికి చేర్చడంతో ఉత్సవాలు ముగిశాయి. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎస్‌ఐ పెద్దయ్యనాయుడు, సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

మద్దికెర: గ్రామంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినా, అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినా పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు హెచ్చరించారు. మంగళవారం కొంతమంది పంచాయతీ స్థలాలు ఆక్రమించడమే గాకుండా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టి బాడుగలకు ఇచ్చుకుంటున్నారంటూ పంచాయతీ సభ్యులు బాలచంద్ర, లక్ష్మీనారాయణ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్లు మాట్లాడుతూ ఖాళీ స్థలం కనబడితే చాలని బంకులు, రేకుల షెడ్లు నిర్మించి రెంట్లకు ఇచ్చి పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈఓఆర్డీ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

మద్దికెర: మండల పరిధిలోని బొజ్జనాయునిపేట గ్రామంలో చేపట్టిన నీటి ట్యాంకు పనులను మంగళవారం జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నీటి సమస్య పరిష్కరించేందుకు రూ.20 లక్షలతో ట్యాంకు నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. అలాగే ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చి నీటిని సరఫరా చేస్తామన్నారు. నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

23న బండలాగుడు పోటీలు

దేవనకొండ: మండలంలోని గుండ్లకొండ గ్రామంలో ఆంజనేయస్వామి, కింది శివాలయం, వీరభద్రస్వామి, కాజాపురం సుంకులా పరమేశ్వరి ఆలయాల్లో ధ్వజస్తంభ ప్రతిష్టాపన సందర్భంగా అంతర్రాష్ట్ర వృషభాల బండలాగుడు పోటీలను ఈనెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు మొదటి బహుమతి కింద రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు చొప్పున అందజేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వారు ఈనెల 22వ తేదీలోపు ఎంట్రీఫీజు రూ.600 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని వివరాలకు 90003 69779 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మాది చేతల ప్రభుత్వం


తారు రోడ్డు శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

మద్దికెర: వైఎస్సార్‌సీపీ మాటల ప్రభుత్వం కాదని, చెబితే చేసి తీరుతామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి స్పష్టం చేశారు. మద్దికెర నుంచి మజారా గ్రామమైన బొజ్జనాయునిపేటకు రూ.2.29 కోట్లతో వేసిన తారు రోడ్డు, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా స్థానిక సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. గోశాలకు స్థలం ఇప్పించాలని ఆలయ నిర్వాహకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం బొజ్జనాయునిపేటకు తారు రోడ్డు ఏర్పాటు చేశామన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని వివరించారు. గ్రామాల్లో సచివాలయం, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకు పాలన తెచ్చిన ఘనత సీఎం జగనన్నకు దక్కుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం గ్రామంలో ఎలాంటి అభివృద్ధి చేయలేకపోయిందన్నారు. తమ ప్రభుత్వంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని, సంక్షేమం, అభివృద్ధి కొనసాగేందుకు మరోసారి సీఎం జగనన్నను దీవించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడిన విద్యార్థులు, రైతులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. జెడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, ఎంపీపీ డీఎస్ అనితాయాదవ్, సర్పంచులు బండారు సుహాసిని, కారుమంచి మల్లికార్జున, బురుజుల విజయుడు, ఐడీసీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సొసైటీ అధ్యక్షుడు శాంతన్న, పంచాయతీ సలహాదారు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ పాటించాలి

మద్దికెర: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తప్పనిసరిగా మెనూ పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని ఎంపీడీఓ అలివేలమ్మ హెచ్చరించారు. మంగళవారం ఎం.అగ్రహారం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం కేంద్రాలలో చిన్నారులకు ఆహారం అందించాలని, అలాగే గర్భవతులు, బాలింతలకు పోషకాహారం సకాలంలో అందించాలని సూచించారు. ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. పోలింగ్ బూత్‌లను పరిశీలించి మౌలిక వసతుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈఓ సంజప్ప, వీఆర్వో స్వర్ణమ్మ ఉన్నారు.

26 నుంచి దస్తగిరి స్వామి ఉరుసు

ఆస్పరి: మండలంలోని ములుగుందం గ్రామంలో వెలసిన దస్తగిరి స్వామి 268వ ఉరుసు ఈ నెల 26 నుంచి నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు మంగళవారం తెలిపారు. 26న గంధం, 27న ఉరుసు, 28న జియారత్ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలి

ఆలూరు: ఎన్నికల నియమ నిబంధలకు అనుగుణంగా సెక్టోరియల్ అధికారులు పనిచేయాలని ఆలూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామునాయక్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో మంగళవారం ఎన్నికల డీటీ గుండాలనాయక్ సమక్షంలో నియోజకవర్గం సెక్టోరియల్ అధికారులు, పోలీసులు తదితరులతో ఆయన సమావేశమయ్యారు. ఆర్వో మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రంలో నెలకొన్న సమస్యలను సెక్టోరియల్ అధికారులు గుర్తించి నివేదిక తయారు చేయాలన్నారు. ప్రధానంగా పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, మరుగుదొడ్లు, కిటికీలు, విద్యుత్ తదితర సదుపాయాలను ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.

ఆలంకొండలో ఉరుసు ప్రారంభం

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ గ్రామంలో మంగళవారం దస్తగిరయ్య స్వామి ఉరుసు ప్రారంభమైనట్లు గ్రామస్తులు తెలిపారు. ఉరుసు సందర్భంగా దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం తెల్లవారుజామున మేళాతాళాల మధ్య స్వామికి గంధం సమర్పించడం జరుగుతుందన్నారు. భక్తులకు దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మధ్యాహ్నం రాష్ట్రస్థాయి కబడ్డీ, బండలాగుడు పోటీలు ఉంటాయని వెల్లడించారు.

మహిళా శక్తికి 'ఆసరా'


మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, సమన్వయకర్త బుట్టారేణుక


'థ్యాంక్యూ సీఎం' ప్లకార్డులను ప్రదర్శిస్తున్న మహిళలు


గోనెగండ్ల: మహిళల ఆర్థిక స్వావలంబనతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గోనెగండ్లలో బాషా ఫంక్షన్ హాలు నందు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బుట్టా రేణుక జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వ్యాపార రంగంలో సైతం మహిళలు ఉన్నతంగా రాణించేలా ప్రోత్సాహం అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. నవరత్న పథకాల కింద ప్రజలకు కోట్లాది రూపాయలు పంపిణీ చేశారని వివరించారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, అవినీతికి తావు లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమ చేయడం జరిగిందన్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం జగనన్నకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ అండగా నిలవాలని కోరారు. సమన్వయకర్త బుట్టా రేణుక మాట్లాడుతూ.. మహిళలు మహారాణులు కావాలనేదే సీఎం జగనన్న లక్ష్యమని, పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. అక్కచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధికి 14 సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. అనంతరం మండలానికి మంజూరైన నాలుగో విడత వైఎస్సార్ ఆసరా రూ.3.48 కోట్ల చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. పొదుపు సంఘాల మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఎంపీపీ టీ.నసురుద్దీన్, వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, యూత్ అధ్యక్షుడు బందెనవాజ్, దొరబాబు, బుట్టా నీలకంఠప్ప, ఎంపీడీఓ సోనీబాయి తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్



పొదుపు మహిళల రుణాలు మొత్తం మాఫీ చేస్తానంటే నమ్మబుద్ధి కాలేదు. అయితే ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో మా పొదుపు గ్రూపు రుణానికి సంబంధించి నగదు పూర్తిగా చెల్లించారు. మండలంలో రూ.3.48 కోట్ల పొదుపు రుణాలు మాఫీ అయ్యాయి. మహిళలకు అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరువలేం.
– తిమ్మక్క, ఎస్.లింగందిన్నె గ్రామం

మహిళలకు అండగా నిలిచారు



మా సంఘానికి ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో రుణమాఫీ కింద రూ.3.40 లక్షలను ప్రభుత్వం జమ చేసింది. ఈ సహాయానికి తోడు మా ఇంటికి వైఎస్సార్ ఆసరా, చేయూత, అమ్మఒడి, పింఛన్, సున్నా వడ్డీ పథకం అమలు చేస్తుండడంతో మాపై రుణభారం తగ్గింది. ఆసరా, చేయూత తదితర పథకాల ద్వారా మహిళలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది.
– అంజూమ్, పెద్దనేలటూర్ గ్రామం